

# ఇదినిజం

RNI Regd.No: APTEL/2012/45871

WWW.IDHINIJAM.COM

సాయంకాలం దినపత్రిక

పొట్టిశ్రీరాములు నెల్లూరు సంపుటి : 20 సంచిక: 36 ఎడిటర్: మాదాల వెంకటశేషగిరి సోమవారం 19 అక్టోబర్ 2026 పేజీలు : 08 వెల: 02




# పట్టణ ఎన్నికల.. రణభేరి!

- చివరి రోజున పోటెత్తిన నామినేషన్లు
- సందడిగా మారిన నామినేషన్ల కేంద్రాలు
- 21న నామినేషన్ల ఉపసంహరణ
- 28న పోలింగ్.. 30న ఫలితాలు
- మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు
- మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో అభ్యర్థుల బలాబలాలపై చర్చ
- 100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల సందడి
- కడప, రాజంపేట, పులివెందుల, తిరుపతిలో చెదురుముదురు సంఘటనలు

## తొలివిడత నామినేషన్లు పూర్తి



విజయవాడ,(ఇదినిజం ప్రతినిధి): రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తొలి విడతలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటిలో 13 నగరపాలక సంస్థలు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థలకు ముందస్తు ప్రక్రియలు పూర్తికాకపోవడం, న్యాయపరమైన అంశాల నేపథ్యంలో ప్రస్తుత షెడ్యూల్‌లో ఎన్నికలు ప్రకటించలేదు ఈ నెల రు 16న ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలతో ముగిసింది. చివరి రోజున అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేయడంతో కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా బరిలో నిలిచేందుకు నామినేషన్లు సమర్పించారు. నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో పలు ప్రాంతాల్లో రాజకీయ కార్యకలాపాలు ఊపందుకున్నాయి. ఈ నామినేషన్ ల ప్రక్రియలో కడప. రాజంపేట, పులివెందుల, తిరుపతి, పుంగనూరులలో చెదురుముదురు సంఘటనలు జరిగాయి.. అయితే చివరి రోజైన నేడు ఈ స్థానాలలో నామినేషన్ ల దాఖల కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

### ఉపసంహరణలపై ఉత్కంఠ

నామినేషన్ల పరిశీలన ఈ నెల 19న జరగనుంది. ఈ ప్రక్రియ అనంతరం పోటీలో నిలిచే అభ్యర్థులపై స్పష్టత రానుంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 21 వరకు గడువు ఉంది. ప్రధాన పార్టీల మధ్య పొత్తులు, స్థానిక నాయకుల మధ్య సమన్వయం, రెబల్ అభ్యర్థుల బరిలో నిలవడం వంటి అంశాలు ఉపసంహరణలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత తుది అభ్యర్థుల జాబితా వెల్లడికానుంది.

### 28న పోలింగ్.. 30న ఫలితాలు

రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలకు 28న పోలింగ్ నిర్వహించనున్నారు. అవసరమైతే 29న రీపోలింగ్ చేపట్టేందుకు షెడ్యూల్‌లో అవకాశం కల్పించారు. 30న ఓట్ల లెక్కింపు జరిపి ఫలితాలు ప్రకటించనున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో సంబంధిత ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది.

# ‘ఓటు చోరీ’కి వాళ్లు మూల్యం చెల్లించుకుంటారు: రాహుల్



ఢిల్లీ, (ఇదినిజం ప్రతినిధి): సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సీఈసీ ఓటు చోరీకి పాల్పడ్డారనే విషయం యావత్ ప్రపంచానికి తెలుసునని, ఆయనకు అమిత్ షా, ప్రధాని మోదీ మద్దతుగా నిలిచారని ఆరోపించారు. ఇందుకు వాళ్లు తగిన మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. గోవాలో రాష్ట్ర కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న రాహుల్.. నేతలు, కార్యకర్తలతో కలిసి రెండు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో మనకు ప్రపంచస్థాయి విద్యా వ్యవస్థ ఉండేదని, కానీ.. ఇప్పుడు మాత్రం నిరసనలు చేస్తున్న విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఉపయోగిస్తున్నారని విమర్శించారు.

### ఇది విద్యా వ్యవస్థ కాదు!

దేశంలో విద్యా వ్యవస్థ దారుణంగా తయారయ్యిందని కాంగ్రెస్ నేత విమర్శించారు. డబ్బు, అధికారం లేకుంటే.. లేదా.. ఇంగ్లిష్ రాకపోతే ఈ వ్యవస్థ ఏ మాత్రం ఆలోచించకుండా మిమ్మల్ని బయటకు నెట్టేస్తుందన్నారు. దీన్ని విద్యా వ్యవస్థగా పిలవలేమన్నారు. లక్షలాది మంది దేశ యువతను వ్యవస్థకు దూరంగా ఉంచేందుకు రూపొందించిన ‘బహిష్కరణ వ్యవస్థ’ అని విమర్శించారు. కొంత మంది విద్యార్థులతో జరిపిన సంభాషణ వీడియోను ఇన్‌స్టాలో షేర్ చేసిన రాహుల్ ఈ విధంగా స్పందించారు.

# ప్రజలకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పించాలి: జగన్



విజయవాడ, (ఇదినిజం ప్రతినిధి): ప్రజలకు స్వేచ్ఛగా ఓటు వేసే అవకాశం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ పునేఠాను కోరినట్లు వైకాపా అధినేత జగన్ తెలిపారు. విజయవాడలో ఎస్ఈసీని కలిసి రాష్ట్రంలో జరుగుతున్న పలు ఘటనలపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో జగన్ మాట్లాడారు. “రెండు, మూడు రోజులుగా జరుగుతున్న ఘటనలపై ఆధారాలతో సహా ఎస్ఈసీకి వివరించాం. పలు చోట్ల వైకాపా అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను లాక్కుంటున్నారు. సాయంత్రం గవర్నర్‌ను కూడా కలిసి అన్ని వివరాలు తెలియజేస్తాం. కేంద్ర బలగాలను రప్పించాలని ఎస్ఈసీకి విజ్ఞప్తి చేశాం. పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల లోపల, బయట లైవ్ ప్రసారాలు ఉండాలని కోరాం. 17 సి ఫామ్‌లో సంతకాలు ఫోర్జరీ జరగకుండా చూడాలని ఎస్ఈసీకి విజ్ఞప్తి చేశాం” అని జగన్ తెలిపారు.

- సింహవాహినిగా జగన్మాత దివ్యదర్శనం
- వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు
- ఎనిమిదో రోజు దుర్గాదేవి అలంకరణలో కనకదుర్గమ్మ
- పుష్పాలంకరణలతో శోభాయమానంగా ప్రధాన ఆలయం

# శక్తిస్వరూపిణిగా దుర్గాదేవి





విజయవాడ, ప్రజాపాలన ప్రతినిధి : దుష్టశిక్షణకు ప్రతిరూపిణిగా.. శత్రుసంహారిణిగా.. భక్తజనులకు అభయమిచ్చే శక్తిస్వరూపిణిగా జగన్మాత శ్రీ కనకదుర్గమ్మ దుర్గాదేవి అలంకరణలో దివ్య తేజస్సుతో విరాజిల్లారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఎనిమిదో రోజైన ఆదివారం అమ్మవారి దివ్యమంగళ స్వరూపం భక్తులను పరవశింపజేసింది. సింహవాహినిగా అమ్మవారు దర్శనమిస్తుండగా, పుష్పాలంకరణలతో శోభాయమానంగా మారిన ప్రధాన ఆలయ ప్రాంగణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారి నామస్మరణతో ఇంద్రకీలాద్రి మార్మోగింది. దుర్గమ్మను కనులారా దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో రద్దీకి అనుగుణంగా తెల్లవారుజామున 3.45 గంటలకే దర్శనాలు ప్రారంభించారు. భవానీ భక్తుల రాకతో కొండపై ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవారి దివ్యరూపాన్ని దర్శించుకుని భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

### వేకువజామునే ప్రత్యేక పూజలు

అమ్మవారి దర్శనంతోపాటు ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు భక్తులు తెల్లవారుజామునే ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. ఉదయం 4 గంటలకు దేవీ ఖడ్గమాలార్చన, 6 గంటలకు కుంకుమార్చన పూజలు ప్రారంభమయ్యాయి. ఉభయదాతలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఓం టర్నింగ్ నుంచి పూజా విభాగం సిబ్బంది వారిని పూజా మండపం వద్దకు తీసుకెళ్లారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా దర్శన క్యూలైన్ల నిర్వహణ, తాగునీటి సరఫరా, అన్నప్రసాద పంపిణీ, పారిశుద్ధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు అందించడంతోపాటు చిన్నారులకు పాలు పంపిణీ చేస్తున్నారు. భక్తులకు అన్నప్రసాదం అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

### నిరంతర నిఘా.. పటిష్ట భద్రత

భక్తుల రాకపోకలకు అంతరాయం కలగకుండా పోలీసు సిబ్బంది క్యూలైన్లను పర్యవేక్షిస్తున్నారు. సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థల ద్వారా రద్దీ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణమే స్పందించేలా సంబంధిత సిబ్బందిని అప్రమత్తంగా ఉంచారు. దేవాదాయ శాఖ కమిషనర్ కే. రామచంద్ర మోహన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్, పాలకమండలి చైర్మన్ బొర్రా గాంధీ, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం. ధ్యానచంద్ర ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ఉత్సవాల నిర్వహణను పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారు.

ఇదినిజం
RNI Regd.No: APTEL/2012/45871
సాయంకాలం దినపత్రిక

# సంపాదకీయం

సోమవారం 19 అక్టోబర్ 2026

## హద్దులు దాటుతోన్న వివక్ష

భారతదేశ సామాజిక ముఖచిత్రంపై మిగిలిపోయిన మానని గాయం కుల వివక్ష. శతాబ్దాలుగా వేళ్లూనుకుపోయిన అంటరానితనం, సామాజిక అసమానతల నుండి విముక్తి కోసం అణగారిన వర్గాలు ఆశ్రయించిన ఒక మార్గం---మత మార్పిడి. హిందూ సామాజిక వ్యవస్థలోని వివక్షను తట్టుకోలేక, సమానత్వం దొరుకుతుందనే ఆశతో లక్షలాది మంది ఇస్లాం, క్రైస్తవం వంటి ఇతర మతాల్లోకి మారారు. అయితే, కేవలం మతం మారినంత మాత్రాన శతాబ్దాల నాటి సామాజిక వెనుకబాటుతనం, వివక్ష రాత్రికి రాత్రే తుడిచిపెట్టుకుపోతాయా? మొన్నటి సుప్రీంకోర్టు తీర్పు ఈ సుదీర్ఘ సామాజిక వివక్ష?పై చర్చను మళ్లీ తెరపైకి తెచ్చింది. ఇస్లాం మతంలోకి మారిన వెనుకబడిన సామాజిక తరగతుల వారికి రిజర్వేషన్ ప్రయోజనాలను అమలు చేయడానికి నిరాకరిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. 'హిందూ మతం నుండి మరో మతానికి మారిన వ్యక్తి, మత మార్పిడికి ముందు తన కులం ఆధారంగా లభించే వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ ప్రయోజనాలను ఆటోమేటిక్‌గా పొందలేరు' అంటూ రూలింగ్ ఇచ్చింది. ఇతర మతాల్లోకి మారిన వారికి షెడ్యూల్డ్ కులాల రిజర్వేషన్ ప్రయోజనాలను తిరస్కరిస్తూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో కలిపి చూసినపుడు ఈ తీర్పు, రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వం, సామాజిక న్యాయం వంటి సూత్రాలకు తీవ్ర విఘాతం కలిగిస్తోందని న్యాయ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.వివక్ష, అస్పృశ్యతా శృంఖలాల నుంచి విముక్తి లభిస్తుందనే ఆశతో తరతరాలుగా అనేకమంది దళిత, అణచివేతకు గురైన వర్గాల ప్రజలు ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, సిక్కు మతాలను స్వీకరించారు. అయితే, "మతం మారినంత మాత్రాన సమాజం వారిపై చూపే వివక్ష తొలగిపోతుందా?" అనే ప్రశ్న నేటికీ అపరిష్కృతంగానే నిలిచింది. దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలు అనే గుర్తింపులే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. 'భారత్‌లో కులం అనేది మతాన్ని మించిన బలమైన సామాజిక శక్తి. ఒక వ్యక్తి క్రైస్తవంలోకి లేదా ఇస్లాంలోకి మారినంత మాత్రాన సమాజం అతని పట్ల చూపే కుల వివక్ష లేదా అస్పృశ్యతా వైఖరి రాత్రికి రాత్రే మాయమైపోదు. ఈ సామాజిక వాస్తవాలను పక్కనపెట్టి, మత ప్రాతిపదికన మాత్రమే రాజ్యాంగ రక్షణలను పరిమితం చేయడం సమంజసం కాదు' అని ప్రముఖ రాజ్యాంగ కోవిదుడు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ మార్కండేయ కట్జూ స్పష్టం చేశారు. ప్రఖ్యాత విద్యాసంస్థల్లో సైతం వరుసగా జరుగుతున్న దళిత, గిరిజన విద్యార్థుల మరణాలు మన విద్యా వ్యవస్థలోని కుల వివక్ష రూపాలను ఎత్తిచూపుతున్నాయి. "రిజర్వ్‌డ్ సీటుతో ఐఐటీ గేట్లు దాటితే వివక్ష అంతమవుతుందని నమ్మే వారున్నారు. వాస్తవానికి అసమానత అక్కడ నుంచే మొదలవుతుంది" అని రచయిత్రి వైష్ణా రాయ్ పేర్కొంటారు. ఐఐటీ బాంబేలో, రెండవ ఏడాది చదువుతున్న దళిత విద్యార్థి సాహిల్ వాకోడే సెప్టెంబర్ 18న ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఈ ఏడాది ఒక్క ఐఐటీ బాంబేలోనే 3 ఆత్మహత్యలు, అన్ని ఐఐటీలలో కలిపి మొత్తం 10 ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఇంగ్లీష్ మాట్లాడే నేర్పు, శరీర భాష, దుస్తుల శైలి వంటి అంశాల ఆధారంగా విద్యార్థులను అంచనా వేయడం ప్రారంభమవుతుంది. "కోటా విద్యార్థులు" అని గేలి చేసే వ్యాఖ్యలు విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. ఐఐటీ సీటు అంటే వివక్షకు ముగింపు అని నమ్మిన విద్యార్థులకు అది నిజం కాదని అర్థమవుతుంది. వాస్తవానికి, ఇటీవలి క్యాంపస్ సర్వే వెల్లడించినట్లుగా, రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులలో మానసిక ఆరోగ్య సమస్యలకు కుల వివక్షే ప్రాథమిక కారణం. "ఉన్నత కులాలకు చెందిన వారు వ్యాప్తి చేసిన 'మెరిట్', 'సమర్థత' అనేవి ఒక అపోహ మాత్రమే. వేల సంవత్సరాలుగా విద్య, అవకాశాలు వారి గుత్తాధిపత్యంలో ఉండి, నేడు రిజర్వేషన్ల ద్వారా అణగారిన వర్గాలు ముందుకు వస్తుంటే తట్టుకోలేక సృష్టించిన సిద్ధాంతమిది" అని యుజిసి మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ సుఖ్‌దేవ్ థోరట్ అంటారు. ఇది కేవలం ఉన్నత విద్యకే పరిమితమైన సమస్య కాదు; దీని మూలాలు పాఠశాల స్థాయిలోనే ఉన్నాయి.సామాజిక న్యాయ భావననే దెబ్బతీసే రీతిలో సుప్రీంకోర్టు నిర్ణయాలు వెలువడుతుండటం ఆందోళనకరం. మత మార్పిడి జరిగినంత మాత్రాన శతాబ్దాలుగా వస్తున్న కులపరమైన వివక్ష లేదా సామాజిక, ఆర్థిక అసమానతలు ఆటోమేటిక్‌గా తొలగిపోవు. మతపరమైన హద్దులకు అతీతంగా కుల అణచివేత కొనసాగుతూనే ఉంటుంది. మతాన్ని ప్రాతిపదికగా తీసుకుని రిజర్వేషన్లను నిరాకరించడం రాజ్యాంగం అందించిన సమానత్వ సూత్రానికి విరుద్ధం. "మతం మారితే సరిపోదు... వారి జీవనానికి మూలమైన భూ సంబంధాలు మారాలి. 'హిందూ మతాన్ని వదిలి వేరే మతంలోకి మారినంత మాత్రాన దళితులపై ఉన్న సామాజిక ముద్ర అంతం కాదు. మతం మారిన వారు పాత సామాజిక వివక్షను కొత్త మతంలోనూ ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎందుకంటే భారతదేశంలో కుల వ్యవస్థ అనేది ఒక మానసిక రోగం, అది అన్ని మతాల్లోకి పాకింది' అంటారు అంబేద్కర్. కోర్టు తీర్పులు చట్టబద్ధమైన పరిధులను నిర్దేశించవచ్చు, మతాలు తమ సిద్ధాంతాలను మార్చుకోవచ్చు. కానీ, సమాజంలో కుల వివక్ష అనే అంధకారం తొలగాలంటే కావాల్సింది దేవుళ్ల మార్పు కాదు; కుల వివక్ష?కు మూలమైన ఉత్పత్తి సంబంధాలు మారాలి. కుల వ్యవస్థను బలపరిచే మనువాద సంస్కృతిని ఎదిరించాలి.

# వసంతం తప్పక వస్తుంది!?

"మీరు పూలన్నింటినీ కోసేయవచ్చు, కానీ వసంత కాలం రాకుండా మాత్రం ఆపలేరు." పాబ్లో నెరుడా రాసిన చిరస్మరణీయమైన పంక్తులివి. మానవాళి, నాగరికతల సమున్నత లక్ష్యం కోసం సాగిపోయే ప్రజలు సామూహిక విజయం సాధించడం అనివార్యమని ప్రకటిస్తున్న అంతిమ వాక్యాలివి. మన గణతంత్ర రాజ్యాంగంలో కీలకాంశమైన ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి–ఓటు హక్కుపై జరిగిన దారుణమైన దాడిని ఎదుర్కోడానికి ప్రారంభమైన ఈ పోరాటం–సమకాలీన భారతదేశంలోనే ప్రజాస్వామ్యం కోసం సాగే అతి గొప్ప పోరాటాలలో ఒకటిగా విస్తరించింది.భారత ఎన్నికల సంఘం (ఇ.సి.ఐ) గత ఏడాది చేపట్టిన ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర పరిశీలన' (సర్) ప్రక్రియ సామూహికంగా పౌరుల ఓటు హక్కును హరించేదిగా తయారవడం, దానికి వ్యతిరేకంగా ఈ పోరాటం రావడం యాదృచ్ఛికమేమీ కాదు. పౌరులుగా పరిగణించబడాల్సిన ఎంతో మంది న్యాయమైన ఓటర్ల పేర్లను భారీ ఎత్తున తొలగించడంపై పోరాటం ప్రజాస్వామ్యం పట్ల ప్రజల నిబద్ధతను చాటి చెప్పే సువర్ణాధ్యాయమైంది.

**ప్రజాస్వామ్య పోరాటం – హిందుత్వ**

భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందే, అంటే బ్రిటిష్ వలస పాలనపై సాగిన స్వాతంత్ర్య పోరాట కాలంలోనే ప్రజాస్వామ్యం కోసం పోరాటం ఆరంభమైంది. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత, అపఖ్యాతికరమైన 1975 'ఎమర్జెన్సీ' (అత్యవసర పరిస్థితి) కాలంతో సహా, దేశ ప్రజలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి నిర్విరామంగా పోరాడుతూనే ఉన్నారు. ఇక ఇప్పుడు ఒక నయా–ఫాసిస్టు పాలన నీలి నీడల్లో–మన పౌరసత్వం కొలబద్దలనే మార్చేయాలని చూస్తున్న సమయంలో అందుకు వ్యతిరేకంగా సాగుతున్న ఆ పోరాటం బహుశా వాటన్నిటిలోనూ అతి భీకరమైనది కావచ్చు.

పౌరసత్వాన్ని 'హిందుత్వ' ప్రాతిపదికన పునర్నిర్వచించాలని, బహుళ జాతి, బహుళ మత, బహుళ సాంస్కృతిక స్వభావంగల మన ప్రజాస్వామ్యాన్ని మతపరమైన గుర్తింపుతో ముడిపెట్టే ఒక మొండి సూత్రం రుద్దాలని ప్రయత్నం సాగుతున్నది. ఇలా చేయడమంటే మన ప్రజాతంత్ర, లౌకిక, సమాఖ్య గణతంత్ర వ్యవస్థ మూలాలను బూటకంగా మార్చేయమేనన్నది సుస్పష్టం. హిందుత్వ అనే దాంతో ముడిపెట్టేయాలనడం మన 'భిన్నత్వంలో ఏకత్వ' స్వరూపాన్ని కాస్తా మార్చేసి దేశాన్ని మెజారిటీవాదపు సంకుచిత చట్రంలో బంధించే ఒక శ్మశానవాటికగా మార్చేయడానికే దారితీస్తుంది. ఆధునిక దృక్పథంతో, పురోగమన శీలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించాలనే ఆకాంక్ష దిశగా మన ప్రజాస్వామ్య అనుభవం మారుతున్న కాలానికి అనుగుణంగా రూపుదిద్దుకోవాల్సి ఉంది.

అందుకే ఎప్పటికప్పుడు ఓటర్ల జాబితాలను నిరంతరం సవరించడమనేది మన ఎన్నికల వ్యవస్థను నడిపిస్తూ వస్తోంది. అయితే, ఈసారి 'ఎస్.ఐ.ఆర్' ప్రక్రియతో దాన్నంతటినీ తలకిందులు చేసే ప్రయత్నం జరిగింది. భారీ స్థాయిలో చొరబాట్లు జరుగుతున్నాయనే భయాన్ని సాకుగా చూపి, 'పౌరులు కాని వారిని' తొలగించి ప్రక్షాళన చేయాలనే ఒక తతంగం మొదలైంది. ఇదే ఒక మహోత్పాతంగా పరిణమించింది. 13 కోట్ల మందికి పైగా పౌరులు తమ రాజ్యాంగబద్ధమైన ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. పశ్చిమ బెంగాల్‌లో 27 లక్షల మంది పౌరులకు ఓటు వేసే అవకాశం నిరాకరించబడిందంటే ఈ ప్రమాదం ఎంత తీవ్రమైందో స్పష్టం చేసింది.

**జ్ఞానేశ్ కుట్ర ఛేదిస్తూ...**

ఈ క్రమంలో పాల్పడిన అడ్డగోలు పద్ధతులు, అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై 'పీపుల్స్ డెమోక్రసీ' వరుస కథనాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ వస్తున్నాయి. రాజ్యాంగం కల్పించిన అధికారాలను దుర్వినియోగ పరుస్తూ జ్ఞానేష్ కుమార్ సాగించిన కుట్రను కూడా ఈ కథనాలు ఎండగట్టాయి. ఒక్కసారిగా ఈ అడ్డగోలు వ్యవహారాలు బయటపడగానే అత్యంత తీవ్ర వ్యతిరేకత ప్రజ్వరిల్లింది, ప్రతిఘటన తారాస్థాయికి చేరింది. కేవలం ఓటు హక్కును కాపాడుకోవడానికే గాక భారతదేశ బహుళపక్ష ప్రజాస్వామ్య స్ఫూర్తిని రక్షించుకోవడానికి జరిగిన పోరాటంగా మారింది. జ్ఞానేష్ కుమార్ దారుణ పోకడలు, అధికార దుర్వినియోగం తీరులో ఒక ఏకపక్ష, చట్టవిరుద్ధ ధోరణి మాత్రమే గాక తెర వెనుక ఏవో రాజకీయ ఆదేశాల మేరకే పని చేశారని స్పష్టమవుతున్నది.

మన ప్రజాస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జ్ఞానేష్ కుమార్ సాగించిన కుట్రను విజయవంతం చేసేందుకు భారత ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించేలా మార్పులు, చేర్పులు జరిగాయి. ఈ హానికర పరిణామాలను కప్పిపుచ్చడానికి బడా మీడియా చేసిన ప్రయత్నాలు చివరికి బట్టబయలవక తప్పలేదు. గత ఏడాదిన్నర కాలంగా ఈ 'ఎస్.ఐ.ఆర్'







ప్రక్రియ అమలులో దేశ ప్రజాస్వామ్యానికి, ప్రజల ఓటు హక్కుకు వ్యతిరేకంగా సాగిన రోజువారీ కుట్రలు పూర్తిగా బయటపడ్డాయి. మన సమాజంలోని కీలక వర్గాలన్నీ ఈ పోరాటంలో ఏకమవడం గమనించదగ్గ విషయం. ప్రస్తుతం 'జెన్ జీ' అంటున్న యువతది ఇందులో చాలా కీలక పాత్ర అయింది. ఇటీవల కాలంలోనే జెన్ జీ విద్యా రంగంలో ఉన్న అవినీతిపై తమ సమిష్టి శక్తిని చాటిచెప్పారు. రాజ్యాంగాన్ని, దానిలోని ప్రజాస్వామ్యం, ప్రాథమిక హక్కుల సూత్రాలనూ పరిరక్షించడానికి న్యాయవాద వర్గాలు జీవన్మరణ పోరాటాన్ని చేపట్టాయి. మరోవైపు బడా మీడియా దాదాపు పూర్తిగా బిజెపి–ఆర్ఎస్ఎస్ రాజకీయ నాయకత్వంతో కుమ్మక్కయిన కార్పొరేట్ దిగ్గజాల చేతుల్లోకి వెళ్లిపోయింది. అయినా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా స్వతంత్ర మీడియా, నిజాలను బయటపెట్టడంలో అద్భుతమైన పోరాట పటిమ ప్రదర్శించింది. ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న మన ప్రస్తుత పోరాటంలో ఇవి కొత్త అంశాలుగా మారాయి.

**యువత ముద్రతో ఉద్యమం**

యువత తమ తరానికి తగ్గట్టుగా మీమ్స్, కార్టూన్లు, సంగీతం, వ్యంగ్య నాటికలు వంటి మాధ్యమాల ద్వారా ప్రభుత్వ కథనాలను సవాలు చేశారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' అద్భుతమైన పరిశోధనాత్మక పాత్రికేయం జ్ఞానేష్ కుమార్‌ను, ప్రభుత్వాన్ని బోనులో నిలబెట్టిన చివరి అస్త్రంగా పని చేసింది. ఇది పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది. అబద్ధపు కథనాలతో ఈ నిరసనలను అడ్డుకోవడం అటుంచి, కనీసం సవాలు చేయడం కూడా సాధ్యం కాని పరిస్థితి ఏర్పడింది. భారీ సన్నాహాలతో అక్టోబరు10న జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన ప్రదర్శనపై కేంద్ర ప్రభుత్వం భద్రతాదళాలనే గూండాలుగా ప్రయోగించి ఎన్నడూ ఎరగనంత అమానుషకాండకు పాల్పడింది. నిరసనకారుల గొంతు నొక్కేందుకు, ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంస్థలకు చెందిన వారిని మఫ్టీలోని భద్రతా దళాలతో కలిపి ఇంత పెద్ద ఎత్తున రంగంలోకి దించడం బహుశా ఇదే మొదటిసారి కావచ్చు. ఈసారి అధికార యంత్రాంగం అమానుష లక్షణాలలో ఒకటి మహిళా నిరసనకారులు, పాత్రికేయుల పట్ల ప్రదర్శించిన వికృత వైఖరి.

మెట్రో రాకపోకలనూ దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లను నిలిపివేయడం, సరిహద్దుల్లో తనిఖీలు చేపట్టడం, నిరసనలో పాల్గొనే వారిని ఇళ్లకే వెళ్లి పోలీసులు హెచ్చరించడం వంటివన్నీ జరిగాయి. శాంతియుత నిరసన హక్కు, అలాగే, రాజ్యాంగంలోని 19వ అధికరణం లోని వాక్, సభా స్వాతంత్ర్యం స్ఫూర్తి పట్ల ప్రస్తుత పాలక వర్గానికి ఏ మాత్రం నమ్మకమే లేదని స్పష్టమవుతున్నది.

అయితే ఇవన్నీ ఎన్ని చేసినా 'ఇండియా' వేదిక ఆధ్వర్యంలో ప్రజలు జ్ఞానేష్ కుమార్‌ను తొలగించాలని, 'ఎస్.ఐ.ఆర్' ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ మరో పిటిషన్ దాఖలు చేసేందుకు సుప్రీంకోర్టుకు భారీగా తరలిరావడంతో ప్రభుత్వ అణచివేత చర్యలన్నీ విఫలమయ్యాయి. ఢిల్లీ పోలీసులు, వివిధ సంస్థల నుంచి రప్పించిన సుమారు 40,000 మంది భద్రతా సిబ్బంది వున్నా ఆందోళనకారులను అడ్డుకోవడానికి సాహసించని తొలి సందర్భం ఇదే కావచ్చు. రాబోయే మార్పులకు సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. మరోవైపు, 'ఎస్.ఐ.ఆర్' ప్రక్రియలోని లోపాలు అత్యంత స్పష్టంగా బయటపడిన పశ్చిమ బెంగాల్‌లో, గత దశల్లో నమోదు కాని ఓటర్లను చేర్చుకోవడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. అయినప్పటికీ, ప్రభుత్వం ఇంకా పూర్తిగా వెనక్కి తగ్గినట్టు కనిపించదు. నిరసనలకు ఉద్దేశించిన 'జంతర్ మంతర్' అనుమతి కూడా నిరాకరిస్తోంది.

వలం పైపై మార్పులే సరిపోవు. 'ఎస్.ఐ.ఆర్' ప్రక్రియను పూర్తిగా నిలిపివేయాలి,

# యూత్ పెట్టే పరీక్షలో మోదీ పాసవుతారా?

హార్దిక్ పటేల్ ఎవరికైనా గుర్తున్నాడా? ఒక దశాబ్దం క్రితం వార్తా పత్రికల ఫ్రంట్ పేజీలలోను, టెలివిజన్ ప్రైమ్--టైమ్ ప్రసారాలలోనూ అతడికి చాలా ప్రాధాన్యం లభించింది. 2015లో గుజరాత్‌లో పాటీదార్ సామాజికుల ఆందోళనకు పటేల్ నాయకత్వం వహించినప్పుడు అతడి వయసు 22 సంవత్సరాలే. హార్దిక్ ర్యాలీలు ఆ రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని కుదిపివేశాయి. దానికి గడ్డు పరిస్థితులను సృష్టించాయి. అవి చివరకు 2016లో ముఖ్యమంత్రి ఆనందిబెన్ పటేల్ నిష్క్రమణకు దారితీశాయి. నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీని సవాల్ చేసిన ఆ యువకుడు ఇప్పుడు మరో బీజేపీ ఎమ్మెల్యే! తిరుగుబాటు నుంచి పాలకపక్షం శ్రేణుల్లోకి హార్దిక్ ప్రస్థానం 'గుజరాత్ మోడల్ ఆఫ్ మేనేజింగ్ డిసెంట్' (భిన్నాభిప్రాయాలు, నిరసనలను అణచివేయడంలో గుజరాత్ విధానం)ను విశదం చేస్తుంది. ఒక ఉద్యమాన్ని రాజ్యాధికారంతో అణచివేసేందుకు మీరు ప్రయత్నించవచ్చు లేదా ఆ ఉద్యమ ప్రధాన నాయకులను అధికార రాజకీయ వ్యవస్థలో భాగస్వాములుగా చేసుకోవచ్చు. నిరసనకారుడు ఒక భాగస్వామిగా మారవచ్చు, ఆందోళనకారుడు అస్మదీయుడు కాగలడు. అయితే ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ఇప్పుడు ఎదుర్కోవలసిన ప్రశ్న-- బలవంతపెట్టడం లేదా కలుపుకుపోవడం, లేక ఆ రెండు పద్ధతుల కలగలుపుతో గుజరాత్‌ను పాలించిన రీతిలో విశాల భారత్‌ను పరిపాలించడం సాధ్యమేనా? ఢిల్లీలో ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళనకారులపై దమనకాండ ఆ సవాల్‌కు ఒక దృష్టాంతంగా నిలుస్తుంది. భారత ఎన్నికల సంఘం ప్రధానాధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తలపెట్టిన నిరసనలను భగ్నం చేసేందుకు ఢిల్లీ పోలీసులు ముందస్తుగా సీజేపీ నిరసనకారులను నిర్బంధంలోకి తీసుకున్నారు. ప్రజలు నిరసన ప్రదేశానికి చేరకుండా అవరోధాలు కల్పించారు. వందలాది యువజనులను అదుపులోకి తీసుకుని తాత్కాలిక డిటెన్షన్ సెంటర్లకు తరలించారు. ఈ పరిణామాలను కవర్ చేస్తున్న జర్నలిస్టులు కూడా పోలీసు ప్రతాపాలకు గురయ్యారు. సాధారణంగా ద్వైధీభావంతో వ్యవహరించే సుప్రీంకోర్టు సైతం నిరసన తెలిపే స్వేచ్ఛ ఒక ప్రాథమిక హక్కు అని మరోసారి నొక్కి చెప్పిందంటే పోలీసులు వ్యవహరించిన తీరు ఎంత అప్రజాస్వామికంగా ఉన్నదో అర్థమవుతుంది.ప్రతిపక్షాల మరో అరాచక ఆందోళనను తాము ఎదుర్కొంటున్నట్టు మోదీ సర్కార్ విశ్వసించి ఉండవచ్చు. విపక్షాల నిరసనను పోలీసులతో అదుపుచేయవచ్చని, రాజకీయ దురుద్దేశాలతో ఆ నిరసనకు పూనుకున్నాయని కొట్టివేయవచ్చని కూడా




పాలకులు భావించి ఉండవచ్చు. నిరసనల నిర్వాహకులను అరెస్ట్ చేయడం ద్వారా వాటి ప్రభావాన్ని నివారించవచ్చని వారు అనుకుని ఉండవచ్చు. అయితే ఆ అంచనా పూర్తిగా ప్రమాదకరమైన తప్పుడు ఆలోచనే. ఢిల్లీ పరిణామాలు ఈ విషయాన్నే ధ్రువపరుస్తున్నాయి.ఇది సీఏఏ (పౌరసత్వ చట్ట సవరణ) వ్యతిరేక ఆందోళన కాదు. ఆ సందర్భంలో నిరసనకారులను జాతి వ్యతిరేకులు అని అధికార వర్గాలు నిత్యం నిందించాయి. వారిలో ఒకరైన ఉమర్ ఖలీద్ 2020 నుంచి జైలులో ఉన్నాడు. ఇది మూడు కొత్త వ్యవసాయ చట్టాలపై ప్రజ్వరిల్లిన రైతుల ఉద్యమం కూడా కాదు. ఉద్యమించిన రైతులను ప్రభుత్వం తొలుత ప్రతిఘటించింది. వారిలో కొందరు ఖలిస్థానీలు అని కూడా ఆరోపించింది. అంతిమంగా నవంబర్ 2021లో ఆ మూడు చట్టాలను ఉపసంహరించుకోవడం మోదీ సర్కార్‌కు అనివార్యమయింది. ఈ ఉదంతాలు అన్నీ ప్రజా ఉద్యమాలను ఎదుర్కోవడంలో ప్రభుత్వ సంసిద్ధతను తెలియజేశాయి. ప్రస్తుత ఉద్యమం విసురుతున్న సవాల్ స్వభావాన్ని ప్రభుత్వం అర్థం చేసుకున్నదా లేదా అన్నది ఈ నాటి ఒక ముఖ్యమైన ప్రశ్న. ఎందుకంటే ఇది కాంగ్రెస్, రాహుల్‌గాంధీ లేదా కొన్ని ప్రాంతీయ రాజకీయ పక్షాలతో వ్యవహరించడమంత తేలికైన విషయం కాదు, బీజేపీకి ఒక శక్తిమంతమైన ఎన్నికల యంత్రాంగం ఉన్నది. గత పదేళ్లుగా ఆ పార్టీ జాతీయ, రాష్ట్ర స్థాయి ఎన్నికలలో అప్రతిహతంగా గెలుస్తూ వస్తోంది. ఎన్నికలు వచ్చినప్పుడు సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ ఉన్నా, లేకపోయినా తమ ప్రత్యర్థులతో సమర్థంగా పోటీ పడేందుకు అవసరమైన సమస్త వనరులు తమకు ఉన్నాయనే ధీమా బీజేపీ నాయకులకు ఉన్నది.

RNI Regd.No: APTEL/2012/45871
ఇదినిజం
సాయంకాలం దినపత్రిక


# ఆత్మకూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థినిగా ప్రముఖ వైద్యురాలు డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలా...

**అధిష్టాన నిర్ణయంగా పేర్కొన్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి .**
**విద్యావంతురాలు.. ప్రజాసేవకురాలు.. ప్రముఖ వైద్యురాలు.. ఇప్పుడు ప్రజాప్రతినిధిగా కొత్త ప్రస్థానానికి శ్రీకారం!**
**మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వ్యూహాత్మక అడుగులు..**
**ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల్లో విజయభేరికి గ్రీన్ సిగ్నల్!**
**విద్యావంతులకు, మహిళా నాయకత్వానికి పెద్దపీట వేస్తున్న మంత్రి ఆనం!**
**అందరి ఆమోదంతో ఆత్మకూరు మున్సిపాలిటీ లో నూతన అధ్యాయానికి శ్రీకారం...**

ఆత్మకూరు, అక్టోబర్ 18:(ఇదినిజం ప్రతినిధి ): ఆత్మకూరు పురపాలక సంఘ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి వ్యూహాత్మకంగా ముందడుగు వేసింది. విద్యావంతురాలు, ప్రజాసేవకురాలు, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ బొమ్మిరెడ్డి షకీలాను తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఎన్డీఏ కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థినిగా రంగంలోకి దింపడం స్థానిక రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారి నాయకత్వంలో ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికలకు కూటమి శ్రేణులు సమాయత్తమవుతున్నాయిరాజకీయ నేపథ్య కుటుంబం,ప్రజాసేవా దృక్పథం, విద్యార్హతలు, వైద్యరంగ అనుభవం కలిగి ఆత్మకూరు పట్టణ ప్రజలతో సత్సంబంధాలు కలిగిన డాక్టర్ షకీలాను అభ్యర్థినిగా ఎంపిక చేయడం ద్వారా మహిళా నాయకత్వానికి, విద్యావంతులకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కూటమి నాయకులు పేర్కొంటున్నారు. ఆత్మకూరు పట్టణ సమగ్రాభివృద్ధి, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ఎన్నికల్లో ముందుకు సాగేందుకు కూటమి సిద్ధమవుతోంది. మున్సిపల్ పరిధిలోని 28 వార్డుల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మంత్రి ఆనం రాజకీయ అనుభవం, వ్యూహాత్మక రాజకీయ సమీకరణాలు మరింత ఆసక్తికరంగా మారాయి. కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొన్నట్లు స్థానిక ప్రజలు



నాయకత్వం ఒకవైపు.. డాక్టర్ షకీలా విద్యార్హతలు, సేవా దృక్పథం మరోవైపు.. ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అఖండ విజయమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది.డాక్టర్ షకీలా అభ్యర్థిత్వంతో ఆత్మకూరు మున్సిపల్ ఎన్నికల అభిప్రాయపడుతున్నారు.ఆత్మకూరు పురపాలక పీఠంపై ఎన్డీఏ కూటమి జెండా ఎగురవేయడమే లక్ష్యంగా మంత్రి ఆనం నాయకత్వంలో ఎన్నికల కార్యాచరణ ఊపందుకుంది.

# చిలమత్తూరు కాంగ్రెస్ ఎం,పీ,టీ,సీ అభ్యర్థిగా చిన్నిచిన్నీ తేజకు బీఫాం అందజేత.

## తిరుపతి జిల్లా ఇన్‌చార్జి బాలగురువన్ బాబు చేతుల మీదుగా బీఫాం స్వీకరణ

సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి వరదయ్యపాలెం మండలం ఇది నిజం ప్రతినిధి. :తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండల పరిధిలోని చిలమత్తూరు గ్రామానికి చెందిన చిన్నిచిన్నీ తేజకు కాంగ్రెస్ పార్టీ తరపున ఎం,పీ,టీ,సీ అభ్యర్థిగా బీఫాం అందజేసినట్లు సమాచారం. తిరుపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బాలగురువన్ బాబు చేతుల మీదుగా ఆయన బీఫాం అందుకున్నారు.యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. యువతలో సేవాభావం, నాయకత్వ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి అవకాశాలు కల్పించడం ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపాయి.చిలమత్తూరు గ్రామానికి చెందిన చిన్నిచిన్నీ తేజ గతంలో యువకుడిగా గ్రామంలో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు దగ్గరైన వ్యక్తిగా గుర్తింపు పొందినట్లు స్థానిక సమాచారం. ఆయన సేవలను, యువతలో ఉన్న ఆదరణను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ పార్టీ తరపున ఎం,పీ,టీ,సీ అభ్యర్థిగా బీఫాం అందించినట్లు తెలుస్తోంది.జిల్లా ఇన్‌చార్జి బాలగురువన్ బాబు నాయకత్వంలో యువతకు అవకాశాలు కల్పిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. చిలమత్తూరు గ్రామ ప్రజలకు చిన్నిచిన్నీ తేజ విజ్ఞప్తి చిలమత్తూరు గ్రామ అభివృద్ధి కోసం, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడానికి మీ ముందుకు వస్తున్నాను. రాబోయే ఎం,పీ,టీ,సీ ఎన్నికల్లో మీ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాకు వేసి ఆశీర్వదించాలని కోరుతున్నాను. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తాను" అని చిన్నిచిన్నీ తేజ ఓటర్లను అభ్యర్థించారు.మీ అమూల్యమైన ఓటు --హస్తం గుర్తు పై ఓటు వేసి గెలిపిస్తారని చిలమత్తూరు గ్రామ అభివృద్ధికి నేను కృషి చేస్తారని ఆయన ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది.




# నాయుడుపేట వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా 2వ సెట్ నామినేషన్ దాఖలు చేసిన తంబిరెడ్డి రాజేశ్వరమ్మ






సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి. :తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మున్సిపాలిటీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ అభ్యర్థిగా మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి సతీమణి తంబిరెడ్డి రాజేశ్వరమ్మ ఆదివారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పలువురు వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి రెండవ సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి తంబిరెడ్డి రాజేశ్వరమ్మ మాట్లాడారు. నాయుడుపేట మున్సిపాలిటీ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు. తాగునీరు,పారిశుధ్యం, రహదారులు,డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తానని పేర్కొన్నారు.నాయుడుపేట పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల సహకారంతో పనిచేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.నాయుడుపేట పట్టణ ప్రజలందరూ తనకు తమ అమూల్యమైన ఓటును వేసి, చైర్‌పర్సన్‌గా గెలిపించాలని తంబిరెడ్డి రాజేశ్వరమ్మ విజ్ఞప్తి చేశారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.తనకు అండగా నిలుస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్య కర్తలకు,అభిమానులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ,నాయుడుపేట అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యనిర్వహ కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, టిఎంఆర్ గ్రూప్స్ అధినేత తంబిరెడ్డి మోహన్ రెడ్డి,వైసిపి నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైసిపి నాయకులు చదలవాడ కుమార్,గంధవల్లి సిద్దయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# నెల్లూరు నగర రూపురేఖలు మార్చడమే లక్ష్యం!

**ఆరు సంక్షేమ పథకాలతో మేనిఫెస్టో.. స్వతంత్ర మేయర్ అభ్యర్థిగా ఎన్. జయశ్రీ**
**పార్టీల పాలన చూశాం.. ఇక ప్రజల పాలన చూద్దాం!**

నెల్లూరు: (ఇదినిజం ప్రతినిధి ):నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆరు సంక్షేమ పథకాలతో మేనిఫెస్టో రూపొందించి ప్రజల ముందుకు రావాలనే సంకల్పంతో స్వతంత్ర మేయర్ అభ్యర్థిగా ఎన్. జయశ్రీ ముందుకు సాగుతున్నారు. నగర రూపురేఖలను మార్చి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి సాధించడమే తన లక్ష్యమని ఆమె పేర్కొంటున్నారు."ఉద్యమాల గడ్డ.. నెల్లూరు బిడ్డ" అనే నినాదంతో ప్రజల మద్దతు కోరుతున్నారు. పార్టీల పాలనకు భిన్నంగా ప్రజల భాగస్వామ్యంతో నగర అభివృద్ధికి కృషి చేయాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. నగర ప్రజల సమస్యలకు ప్రాధాన్యమిస్తూ సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేయాలన్నదే తన ఆశయమని వెల్లడిస్తున్నారు.నెల్లూరు నగర అభివృద్ధిలో ప్రజలే భాగస్వాములు కావాలని, స్వతంత్ర అభ్యర్థిగా ఎన్. జయశ్రీకి మద్దతు ఇవ్వాలని ఆమె ప్రచార సందేశం ద్వారా కోరుతున్నారు.




# వేడుకగా శ్రీ చాముండేశ్వరి చౌడేశ్వరి దేవీ విగ్రహ ప్రతిష్ఠ



సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి వరదయ్యపాలెం ఇది నిజం ప్రతినిధి. : తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం వరదయ్యపాలెం మండలంలోని దసరా శరన్నవ రాత్రుల విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకుని విశ్రాంత గ్రామీణ బ్యాంకు మేనేజర్ బొప్పన మోహన్ మురళి స్వగృహంలో దేవాంగుల కులదైవమైన శ్రీ చౌడేశ్వరి చాముండేశ్వరిదేవి విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్టించారు.అమ్మవారి జన్మస్థలం అయిన కర్ణానది ఒడ్డున శమీవృక్షం వద్ద చౌడేశ్వరి ప్రతిమకు పూజలు చేసి మంగళ వాయిద్యాలు వేదమంత్రాల నడుమ అమ్మవారి స్తోత్రాన్ని స్తుతిస్తూ మోహన్ మురళి గారి స్వగృహంలో ప్రతి ష్టించారు.అనంతరం సింహవాహనంపై ఆసీనురాలైన అమ్మవారిని పరిమళ పుష్పాలంకరణతో శోభాయం మానంగా అలంకరించి తుమ్మిపూలతో సహస్ర నామార్చన, కుంకుమార్చన వంటి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి మహా నైవైద్యం అర్పించారు.. పట్టణం నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మలవారిని దర్శనం చేసుకున్నారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ బొప్పన తిలక్ బాబు ముఖ్య అతిథిగా హాజరైనరు.

# గాజు గ్లాసుకు మన ఓటు... అభివృద్ధికి తొలి మెట్టు!

నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ):నెల్లూరు నగరంలోని ఆదిత్యనగర్, రాంజీనగర్ ప్రాంతాల్లో 21వ డివిజన్ కూటమి అభ్యర్థి, జనసేన నాయకురాలు విజయలక్ష్మి గునుకుల కి మద్దతుగా జనసేన నాయకులు కిషోర్ గునుకుల,జనసైనికులు వీరమహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నిలిచిపోయిన అభివృద్ధికి భిన్నంగా, కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర సంక్షేమం, నగరాభివృద్ధికి ప్రాధాన్యత లభిస్తోందని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారి ప్రజాహిత ఆలోచనలు, కూటమి ప్రభుత్వ సమష్టి కృషితో ప్రజలకు మెరుగైన పాలన, స్థానిక సమస్యలకు పరిష్కారం అందించడమే లక్ష్యమని తెలిపారు.ఈ ప్రచార కార్యక్రమంలో జనసేన నాయకులు కిషోర్ గునుకుల, వీరమహిళ విజయలక్ష్మి, ప్రశాంత్ గౌడ్,నరహరి,రాజేష్,పవన్, దార్ల నాగేంద్ర బాలు, కృష్ణమోహన్ రెడ్డి, ప్రవళ్ళిక, విజయ, సుప్రియ,కృష్ణవేణి,శ్రీ లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.



# ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దుకమిషనర్ వై.ఓ. నందన్



నెల్లూరు (ఇదినిజం ప్రతినిధి ):స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, ఈ సోమవారం నుంచి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (వి.జి.ఆర్.ఎన్.) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ. నందన్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలియచేసారు. నగర పాలక సంస్థ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధుల్లో అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున, ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు

### అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల.



ఆత్మకూరు, అక్టోబర్ 18 : (ఇదినిజం ప్రతినిధి ): ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు.ఆత్మకూరు సోమశిలరోడ్డులోని ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కళాశాలలో ఆత్మకూరు, సంగం, చేజర్ల, మర్రిపాడు, అనంతసాగరం, ఏ ఎస్ పేట, కలువాయి మండలాలకు సంబంధించి ఏర్పాటు చేయనున్న రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ సెంటర్ గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ సెంటర్లలో బారికేడింగ్ పక్కాగా చేపట్టాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, మంచినీరు మొదలైన కనీస సౌకర్యాలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సిబ్బంది రాకపోకలకు, పోలింగ్ సామగ్రి తరలింపునకు, వాహనాల రాకపోకలు, పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట ఆత్మకూర్ ఆర్డీవో పావని, సర్వే అధికారి కిషోర్, తాసిల్దార్ పద్మజ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలిక రద్దు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా



నెల్లూరు, అక్టోబర్ 18:(ఇదినిజం ప్రతినిధి ): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, ఈ సోమవారం నుంచి స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున, ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.కావున జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి, ఎన్నికల నిర్వహణకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# టీడీపీలో చేరిన బోయిలచెరువెళ్ల గ్రామ వైసీపీ నాయకులు!

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో పసుపు కండువా కప్పుకున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు



ఆత్మకూరు, అక్టోబర్ 18:(ఇదినిజం ప్రతినిధి ):ఆత్మకూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. ఆత్మకూరు రూరల్ మండలం బోయిలచెరువెళ్ల గ్రామానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని రవితేజ కల్యాణ మండపంలో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీ ఆనం రామనారాయణరెడ్డి గారి సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది.

**టీడీపీలో చేరిన ప్రముఖులు:**

మంతు చిన్న యానాది రెడ్డి -- వైసీపీ రైతు విభాగం కార్యదర్శి పడిగిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి -- వైసీపీ సీనియర్ నాయకులు మాల్యాద్రి రెడ్డి పురస నాగేశ్వరి మల్లి నవీన్ పడేటి వెంకటేశ్వర్లు పడేటి వెంకటేష్ మల్లి వెంకటేష్ పడేటి రామయ్య యేసిపోగు బడ్డిశెట్టి యేసిపోగు రాజు తదితర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గారు నూతనంగా చేరిన నాయకులు, కార్యకర్తలకు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఆత్మకూరు నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆనం సూచించారు.

# తెలుగుదేశం పార్టీ చైర్మన్ అభ్యర్థిగా వ సెట్ నామినేషన్ వేసిన షేక్ షాకీరా





సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి. : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట తెలుగుదేశం పార్టీ(కూటమి) చైర్మన్ అభ్యర్థిగా పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ సతీమణి షేక్ షాకీరా ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, కూటమి పార్టీ నాయకులతో కలిసి 2వ సెట్ నామినేషన్ దాఖలు చేశారు.తొలుత పట్టణంలోని గ్రామదేవత శ్రీ పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం బజారు వీధి, మార్కెట్ సెంటర్,బేరిపేట మీదుగా జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అనంతరం నామినేషన్ సెంటర్లో రెండో సెట్ నామినేషన్ ఎన్నికల అధికారికి సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ తమ చైర్మన్ అభ్యర్థి షేక్ షాకీరాను గెలిపించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పట్టణాభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం,బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి,పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్,మాది ఏం సి చైర్మన్ శిరసనంభేటీ విజయభాస్కర్ రెడ్డి,సీనియర్ నాయకులు కట్టా సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ, టిడిపి పట్టణ మాజీ అధ్యక్షులు కందల కృష్ణారెడ్డి,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,పలువురు కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్లు వేసేందుకు టీడీపీకి నాయకులే కరువయ్యారా?

### కుటుంబాలను చీల్చి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం సిగ్గుచేటు

### ఆత్మకూరులో రూ.350 కోట్ల దోపిడీ.. సోమశిల ఆఫ్రాన్ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!

### సూపర్ సిక్స్ సహా హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

### వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ధ్వజం



ఆత్మకూరు: (ఇదినిజం బ్యూరో ఇంచార్జ్ ): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తెలుగుదేశం పార్టీకి అభ్యర్థులు కరువయ్యారా? గెలుపు కోసం కుటుంబాలను చీల్చి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం ఎంతవరకు సమంజసమని వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రశ్నించారు. రాజకీయాలు ప్రజల కోసం చేయాలే తప్ప, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కుటుంబాల మధ్య చిచ్చుపెట్టడం తగదని హితవు పలికారు. అల్లారెడ్డి ఇందుమతిని వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా నిలబెట్టామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేసే నాయకులను ప్రజలు ఆదరించాలని కోరారు. విజయదశమి స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ శ్రేణులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని విక్రమ్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల ముందు గొప్పగా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర హామీలకూ దిక్కులేకుండా పోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆత్మకూరు నియోజకవర్గంలో సుమారు రూ.350 కోట్ల మేర దోపిడీ జరిగిందని, ప్రకృతి వనరులను అడ్డగోలుగా కొల్లగొడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన అభివృద్ధి పనులపై దృష్టి పెట్టకుండా స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తున్నారని మండిపడ్డారు.సోమశిల ఆఫ్రాన్ పనులు రెండేళ్లుగా ఒక్క అడుగు కూడా ముందుకు సాగకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కీలకమైన పనులు నిలిచిపోతుంటే పాలకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అభివృద్ధి పేరుతో ప్రచార ఆర్భాటాలు చేయడం తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. కూటమి పాలనలో సామాన్యుడి బతుకు మరింత భారంగా మారిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వారిని మోసం చేశారని ఆరోపించారు.రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రంలో భయానక రాజకీయ వాతావరణాన్ని సృష్టిస్తున్నారని విక్రమ్‌రెడ్డి విమర్శించారు. చట్టబద్ధమైన పాలనకు బదులుగా రాజకీయ కక్షసాధింపులకు ప్రాధాన్యమివ్వడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. పుంగనూరులో చోటుచేసుకున్న ఘటనలపై ప్రజలకు వాస్తవాలు తెలుసని, అయితే అధికార పక్షానికి అనుకూలంగా వ్యవహరిస్తున్న పచ్చ మీడియాకు మాత్రం అక్కడి అరాచకాలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరిగిన మోసాన్ని ప్రతి గ్రామంలోనూ, ప్రతి ఇంటికీ తీసుకెళ్తామని విక్రమ్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాడుతుందని, ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని నిలదీస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వానికే ఆదరణ ఉంటుందని, రాబోయే ఎన్నికల్లో ప్రజలే కూటమి ప్రభుత్వానికి తగిన సమాధానం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# గేమ్ చేంజర్ - 2026' పురస్కార గ్రహీత డాక్టర్ శ్యామసుందరరావును సత్కరించిన “ప్రగతి సేవా సంస్థ”







గూడూరు. (ఇది నిజం ప్రతినిధి ) ప్రతిష్టాత్మక ‘గేమ్ చేంజర్ అవార్డ్ - 2026’ పురస్కార గ్రహీత, శ్రీ కృష్ణ సేవా సమితి ఫౌండర్ చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త డాక్టర్ బండి శ్యామసుందరరావు (డాక్టర్ మయూరి శ్యాం యాదవ్)ను ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. పట్టణంలోని న్యూ బాలాజీ నగర్ లో గల ప్రగతి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ నెల 11వ తేదీన హైదరాబాద్‌లోని ఎల్.వి. ప్రసాద్ ఫిలిం ఛాంబర్‌లో విశ్వగురు వరల్డ్ రికార్డ్ సంస్థ సీఈఓ సత్యవోలు రాంబాబు గారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు గౌరవ న్యాయమూర్తి జస్టిస్ జూకంటి అనిల్ కుమార్ చేతుల మీదుగా శ్యామసుందరరావు గారు సామాజిక రంగంలో చేస్తున్న విశిష్ట సేవలకు గానూ ‘గేమ్ చేంజర్ అవార్డ్ - 2026’ అందుకున్న విషయం విధితమే.ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడవేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ... మయూరి స్వీట్స్ మరియు వనజా కృష్ణ కళ్యాణ మండపం అధినేతగా వ్యాపార రంగంలోనే కాకుండా, శ్రీ కృష్ణ సేవా సమితి స్థాపించి అభాగ్యులకు, నిరుపేదలకు మయూరి శ్యామ్ యాదవ్ గారు, చేస్తున్న సేవలు ఎందరికో ఆదర్శనీయమని కొనియాడారు. గూడూరు గడ్డపై నుంచి వెళ్లి రాష్ట్ర స్థాయిలో ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకోవడం మన ప్రాంతానికే గర్వకారణమని పేర్కొన్నారు.అనంతరం సన్మాన గ్రహీత డాక్టర్ బండి శ్యామసుందరరావు మాట్లాడుతూ... సమాజ సేవలో లభించే తృప్తి వెలకట్టలేనిదని, ప్రగతి సేవా సంస్థ వారు చూపిన ఈ ప్రేమాభిమానాలు తనకు మరింత ఉత్సాహాన్ని, బాధ్యతను ఇచ్చాయని తెలిపారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ సమాజ హితానికి నా వంతు కృషి చేస్తానని తెలియజేశారు.

# శ్రీకాళహస్తి రిలయన్స్ పెట్రోల్ బంక్ యాజమాన్యం నిర్వాకం

### డిజిటల్ పేమెంట్లు లేవంటూ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు




శ్రీకాళహస్తి. (ఇది నిజం ప్రతినిధి ) దేశంలోనే కాదు ప్రపంచమంతా ప్రస్తుత డిజిటల్ యుగంలో చిన్న బడ్డీ కొట్టు నుంచి పెద్ద పెద్ద మాల్స్ వరకు అన్ని చోట్లా ఆన్‌లైన్ లావాదేవీలు అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం క్యాష్ లెస్ లావాదేవీలను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుంటే, శ్రీకాళహస్తిలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ యాజమాన్యం మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. బంక్‌కు వచ్చే వాహనదారులకు డిజిటల్ పేమెంట్లు స్వీకరించేది లేదు అంటూ మొండిచేయి చూపిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లిస్తామని చెప్పే వినియోగదారులకు “ఇక్కడ డిజిటల్ పేమెంట్లు లేవు, కేవలం చేతికి నగదు మాత్రమే ఇవ్వాలి” అంటూ బంక్ సిబ్బంది నిష్కర్షగా చెబుతున్నారు. దీనివల్ల అత్యవసరంగా పెట్రోల్, డీజిల్ కొట్టించుకోవడానికి వచ్చే వాహనదారులు, ముఖ్యంగా దూరప్రాంత ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతిలో నగదు లేక, పూర్తిగా యూపీఐ యాప్‌లపైనే ఆధారపడే సాధారణ ప్రజలు బంక్ సిబ్బంది ప్రవర్తనతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు డిజిటల్ లావాదేవీల నినాదాలు మార్మోగుతుంటే, ఇంత పెద్ద కార్పొరేట్ సంస్థకు చెందిన పెట్రోల్ బంక్‌లో ఆన్‌లైన్ పేమెంట్ సౌకర్యం లేదనడం వెనుక అసలు కారణమేంటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. కావాలనే యాజమాన్యం ఇలా మొండిగా వ్యవహరిస్తోందా లేక లావాదేవీలను దాచడానికి నగదు రూపంలోనే వసూలు చేస్తున్నారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు స్పందించి, శ్రీకాళహస్తి రిలయన్స్ పెట్రోల్ బంక్‌లో డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని, వినియోగదారులను ఇబ్బంది పెడుతున్న యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కోట సర్పంచ్ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం!

**నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డికి పూర్తి మద్దతు ప్రకటించిన రాజేంద్ర కుమార్ రెడ్డి..**
**గోపాల్ రెడ్డి కుటుంబానికి అవకాశం ఇవ్వాలని నల్లపరెడ్డి రాజేంద్ర కుమార్ రెడ్డి విజ్ఞప్తి..**



కోట. (ఇది నిజం ప్రతి నిది) నెల్లూరు జిల్లా కోట మండలం, కోట పంచాయతీలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కోట పంచాయతీ సర్పంచ్ పదవి అన్‌రిజర్వ్డ్ కావడంతో, నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి కుటుంబం, నల్లపరెడ్డి వినోద్ రెడ్డి కుటుంబం నుంచి అభ్యర్థులు పోటీలో నిలిచే అవకాశం ఉందన్న ప్రచారం స్థానికంగా జోరుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో నల్లపరెడ్డి కుటుంబం నుంచి ఎవరు ఎవరికి మద్దతు ఇస్తారన్న అంశంపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ, నల్లపరెడ్డి గోపాల్ రెడ్డి తనయుడైన నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డికి తన పూర్తి మద్దతు ఉంటుందని నల్లపరెడ్డి రాజేంద్ర కుమార్ రెడ్డి మీడియా ద్వారా స్పష్టం చేశారు.“ కుటుంబం కోసం త్యాగం చేసిన గోపాల్ రెడ్డి కుటుంబానికి అవకాశం ఇవ్వాలి..”తమ కుటుంబంలోని పలువురు ఇప్పటికే వివిధ పదవులు అనుభవించారని, అయితే తన పెదనాన్న గోపాల్ రెడ్డి మాత్రం పదవులను ఆశించకుండా కుటుంబం కోసం త్యాగం చేశారని రాజేంద్ర కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం గోపాల్ రెడ్డి కుటుంబానికి అవకాశం కల్పించాల్సిన సమయం వచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, కోట సర్పంచ్ ఎన్నికల్లో గోపాల్ రెడ్డి కుటుంబానికి అవకాశం ఇచ్చేందుకు నల్లపరెడ్డి వినోద్ రెడ్డి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు నుంచే నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి పార్టీలో కొనసాగుతున్నారని రాజేంద్ర కుమార్ రెడ్డి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కోట సర్పంచ్ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి టీడీపీ మద్దతు లభించేలా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆలోచించాలని ఆయన కోరారు. కోట పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో నల్లపరెడ్డి కుటుంబాల మధ్య పోటీ ఉంటుందా పార్టీ మద్దతు ఎవరికి లభిస్తుంది కుటుంబ సభ్యులందరూ ఏకతాటిపైకి వస్తారా అన్న అంశాలు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఎన్నికల నోటిఫికేషన్, అభ్యర్థుల ప్రకటన అనంతరం ఈ పరిణామాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత.

**ప్లాస్టిక్ వినియోగం పై ఎంవి రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమరభేరి మియో మందులు పంపిణీ.**





వాకాడు. (ఇది నిజం ప్రతినిధి) ఈరోజు ఆదివారం వాకాడు మండలం ఎర్రగటపల్లి పంచాయతీ పరిధిలోని గెద్దల మిట్ట గిరిజన కాలనీలో గిరిజన కాలనీవాసులందరినీ సమావేశ పరిశి పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మనం నేడు పర్యావరణాన్ని కాపాడుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎం వి రావు ఫౌండేషన్ చైర్మన్ పర్యావరణ పరిరక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మనం పర్యావరణాన్ని కాపాడుకోగలిగితే మనకు ఎలాంటి ముప్పు ఉండదని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రతి ఒక్కరూ తమ గ్రామాల్లో నివాసంలో ప్లాస్టిక్లు వాడకుండా చూసుకోవాలని లీలా మోహన్ కృష్ణ కోరారు. అనంతరం గెద్దలమెట్ట గిరిజన కాలనీ వాసులందరికీ ప్లాస్టిక్ సంచులను వాడవద్దని ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను మాత్రమే వాడాలని అదేవిధంగా టీ తాగేవారు టీ కప్పులను ప్లాస్టిక్ కప్పులు వాడకుండా చూడాలని ప్రతి ఒక్కరూ ప్రతి విషయంలో ప్లాస్టిక్ మోతాన్ని తరిమికొట్టాలని మహిళలచే నినాదాలు చేయించారు. ప్రతి మహిళకు ఎం.వి. రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ గుడ్డ సంచులను పంపిణీ చేశారు. గుడ్డ సంచులు వాడి తద్వారా దేశమనిగుడకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన మహిళలను కోరారు. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో వైరల్ ఫీవర్స్ ఉన్నందున వాటిని నివారించే నిమిత్తం ముందస్తు జాగ్రత్త చర్యగా హోమియో మందులను వాడాలని ఆయన కోరుతూ ప్రతి ఒక్కరికి హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం వీ రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ కార్యదర్శి ఎం విజయలక్ష్మి ఎం వర్ణిక అంగనవాడి ఉపాధ్యాయిని సులోచన గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# తిరుపతిలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న అధికార పార్టీ

**ఆమ్ ఆద్మీ పార్టీ మేయర్ అభ్యర్థి నీరుగట్టు నగేష్ పై దాడి**
**కార్పొరేటర్ నామినేషన్ల అడ్డుకోలు**



తిరుపతి (ఇది నిజం ప్రతినిధి ) తిరుపతి బైరాగి పట్టణంలోని రామానాయుడు స్కూల్ నందు గల నామినేషన్ కేంద్రం వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ తరపున వార్డులో పోటీ చేయడానికి వచ్చిన మా కార్పొరేటర్ అభ్యర్థుల నామినేషన్లను అధికార పార్టీ నేతలు అడ్డుకొని బెదిరించడం జరిగింది. అంతేకాకుండా ఆమ్ ఆద్మీ పార్టీ మేయర్ అభ్యర్థి నీరుగట్టు నగేష్ గారిపై కూడా అధికార పార్టీ నేతలు దౌర్జన్యానికి పాల్పడి, నామినేషన్ ప్రక్రియను అడ్డుకోవడానికి ప్రయత్నించారు.ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. గెలవలేమని తెలిసి అధికారాన్ని అడ్డుపెట్టుకొని, మా నామినేషన్లను అడ్డుకుంటున్నారు. తిరుపతిలో ఆమ్ ఆద్మీ పార్టీకి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారు.

**“మా డిమాండ్లు”**

1. ఈ ఘటనపై ఎన్నికల అధికారులు, పోలీసులు వెంటనే చర్య తీసుకోవాలి.
2. మా కార్పొరేటర్ అభ్యర్థులకు, మేయర్ అభ్యర్థికి రక్షణ కల్పించాలి.
3. నామినేషన్లు సజావుగా జరిగేలా చూడాలి.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా తిరుపతి ప్రజలు మా వైపే ఉన్నారు. నిజాయితీకి, చీపురు గుర్తుకు ఓటు వేస్తారని తెలియజేశారు.

# నాయుడుపేట అభివృద్ధికి కొత్త ఆశాకిరణం బండి ఝాన్సీ

**స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి ప్రజాసేవే లక్ష్యంగా ముందడుగు.**

సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి. : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మున్సిపాలిటీ చైర్మన్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన బండి ఝాన్సీ పట్టణ ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నారు. విద్యావంతురాలిగా, ప్రజా సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తిగా, పట్టణ అభివృద్ధి పట్ల స్పష్టమైన ఆలోచనలు కలిగిన అభ్యర్థిగా ఆమె ముందుకు సాగుతున్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం అని ఆమె అన్నారు. అయితే నాయుడుపేట పట్టణంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, మున్సిపల్ సేవలు వంటి సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే దృక్పథంతో బండి ఝాన్సీ ఎన్నికల బరిలో నిలిచారు. అని వారు తెలిపారు ప్రజల అవసరాలను తెలుసుకొని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే సంకల్పంతో ఆమె అభ్యర్థిత్వానికి ప్రత్యేకతగా నిలుస్తోంది.గాడి తిలక్ బాబు ప్రజాస్వామ్య పోరాటం ఆమెకు అదనపు బలం, ప్రజాదరణ పొందిన గాడి తిలక్ బాబు సతీమణిగా బండి ఝాన్సీకి స్థానిక ప్రజలతో అనుబంధం ఏర్పడటానికి అదనపు అవకాశం ఉంది. 2022 మున్సిపల్ ఎన్నికల సమయంలో నాయుడుపేటలో ప్రజలకు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉండాలనే ప్రజాస్వామ్య స్ఫూర్తితో గాడి తిలక్ బాబు ముందుకు సాగినట్లు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు. అప్పటి ఎన్నికల పరిణామాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలనే అంశాన్ని ఆయన ప్రాధాన్యంగా తీసుకున్నారని, ప్రజల ఓటు హక్కు విలువను చాటిచెప్పారని ఆయన మద్దతుదారులు గుర్తుచేస్తున్నారు. ప్రజలకు ఓటు హక్కు కల్పించేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు స్థానిక రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయని వారు అభిప్రాయపడుతున్నారు.ప్రజాస్వామ్య




విలువలకు ప్రాధాన్యం,ఎన్నికలు ఏకగ్రీవంగా ముగియడం కంటే ప్రజలకు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉండటం ప్రజాస్వామ్యానికి కీలకమనే సందేశాన్ని గాడి తిలక్ బాబు వైఖరి ప్రతిబింబించిందని ఆయన మద్దతుదారులు చెబుతున్నారు. ఆ అనుభవం బండి ఝాన్సీ రాజకీయ ప్రయాణానికి కూడా ఒక నేపథ్యంగా నిలుస్తోంది.అభివృద్ధి, పారదర్శకత, ప్రజలకు అందుబాటులో ఉండే పాలనమున్సిపల్ చైర్మన్‌గా అవకాశం లభిస్తే ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వడం, వార్డుల వారీగా సమస్యలను గుర్తించడం, అభివృద్ధి పనులపై పర్యవేక్షణ, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన వంటి అంశాలపై దృష్టి పెట్టడం ఆమె ముందున్న ముఖ్యమైన బాధ్యతలు కానున్నాయి.నాయుడుపేట అభివృద్ధి కోసం ప్రజలతో కలిసి పనిచేయడం, ప్రజల సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వడం, ప్రతి వార్డుకు సముచిత అభివృద్ధి అందేలా కృషి చేయడం ముఖ్యం” అనే సందేశంతో బండి ఝాన్సీ స్వతంత్ర అభ్యర్థిగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ప్రజల ఆశలు,అభివృద్ధి దిశగా ఆమె అడుగులు ముందుకు వేస్తున్నారు .గాడి.తిలక్ బాబు ప్రజాస్వామ్య పోరాట నేపథ్యం, బండి ఝాన్సీ విద్యార్హతలు, ప్రజా సమస్యలపై అవగాహన, పట్టణ అభివృద్ధి పట్ల ఆమె దృక్పథం కలిసి ఆమె అభ్యర్థిత్వానికి ప్రత్యేకతను తీసుకొస్తున్నాయి. నాయుడుపేట ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసే నాయకత్వం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో బండి ఝాన్సీ అభ్యర్థిత్వం చర్చనీయాంశంగా మారింది. నాయుడుపేట అభివృద్ధి కోసం ప్రజలతో కలిసి నడవాలనే సంకల్పంతో బండి ఝాన్సీ ముందుకు సాగుతున్నారు, అని వారు తెలిపారు.

# 12వ వార్డు స్వతంత్ర అభ్యర్థిగా కోసూరు సుధాకర్ నామినేషన్

**ప్రజాసేవ చేయడమే లక్ష్యం వార్డు ప్రజల ఆశీర్వాదం కోరుతున్న సుధాకర్**



సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి. : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట పట్టణంలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో 12వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కోసూరు సుధాకర్ ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ఎన్నికల బరిలోకి దిగినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కోసూరు సుధాకర్ మాట్లాడుతూ వార్డు ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు.ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. 12వ వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి, మద్దతు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న కోసూరు సుధాకర్ నామినేషన్ దాఖలు చేయడంతో 12వ వార్డులో ఎన్నికల సందడి నెలకొంది వారు తెలిపారు.

# నాయుడుపేట 7 వ వార్డు తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన టి.అభిరామ్ ( అబ్రహం)




సూళ్లూరుపేట డివిజన్ ఇన్చార్జి నాయుడుపేట అర్బన్ ఇది నిజం ప్రతినిధి. : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మున్సిపాలిటీ 7 వ వార్డు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా అభిరామ్(అబ్రహం) ఆదివారం నామినేషన్ దాఖలు చేశారు.కూటమి పార్టీ నాయకుల ఆధ్వర్యంలో నాయుడుపేట పట్టణంలో జరిగిన భారీ ర్యాలీలో అభిరామ్ (అబ్రహం) పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని అంబేద్కర్ భవన్ లోని నామినేషన్ సెంటర్ లో తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం,మాజీ ఏఎంసీ చైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డి, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ సహకారంతో ఏడవ వార్డులో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. ఏడవ వార్డు ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు.0

# పిల్లల్లో హైపర్‌యాక్టివిటీ తగ్గించడంలో గుర్రపు స్వారీ ఎంతో మేలు..

## అధ్యయనంలో వెల్లడి..

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో అన్‌షట్జ్ మెడికల్ క్యాంపస్ పరిశోధకులు నిర్వహించిన తాజా అధ్యయనంలో ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. ఆటిజంతోపాటు ఇతర మానసిక ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లల్లో గుర్రపు స్వారీ, గుర్రాలకు సంబంధించిన ప్రత్యేక కార్యకలాపాలు హైపర్‌యాక్టివిటీని తగ్గించడంలో, భావోద్వేగాలను నియంత్రించడంలో, సామాజిక నైపుణ్యాలను మెరుగుపరచడంలో సహాయపడతాయని పరిశోధకులు గుర్తించారు. కొంతమంది ఆటిజం పిల్లల్లో అధిక చురుకుదనం, చిరాకు, భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడం వంటి అంశాలు సవాలుగా మారుతుంటాయి. సాధారణ చికిత్సలు అందరికీ ఒకే విధంగా పనిచేయకపోవడంతో, ప్రత్యామ్నాయ సహాయక విధానాలపై పరిశోధకులు దృష్టి సారిస్తున్నారు. అమెరికా నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ మద్దతుతో నిర్వహించిన ఈ అధ్యయనం పీడియాట్రిక్స్ వైద్య జర్నల్‌లో ప్రచురితమైంది.

### గుర్రపు స్వారీ చేసిన పిల్లలకు ప్రయోజనం..

యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో అన్‌షట్జ్ మెడికల్ క్యాంపస్ పరిశోధకులు చేపట్టిన ఈ పరిశోధనలో, చికిత్సలో భాగంగా గుర్రపు స్వారీ చేసిన ఆటిజం పిల్లల్లో హైపర్‌యాక్టివిటీ గణనీయంగా మెరుగుపడినట్లు వెల్లడైంది. అలాగే గుర్రపు స్వారీ చేయకపోయినా, గుర్రాలతో నేరుగా సంబంధం లేకపోయినా, గుర్రాలకు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొన్న పిల్లల్లోనూ కొన్ని సానుకూల మార్పులు కనిపించాయి. ఆటిజంతోపాటు మరో మానసిక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న పిల్లలను పరిశోధకులు అధ్యయనం చేశారు. ఇందుకోసం పిల్లలను మూడు బృందాలుగా విభజించారు. మొదటి బృందంలోని పిల్లలకు చికిత్సలో భాగంగా గుర్రపు స్వారీ చేయించారు. రెండో బృందంలోని పిల్లలను గుర్రాల శిక్షణ కేంద్రానికి తీసుకెళ్లి, గుర్రాలకు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొనేలా చేశారు. అయితే వీరికి గుర్రపు స్వారీ చేయించలేదు. గుర్రాలతో నేరుగా మమేకమయ్యే అవకాశమూ కల్పించలేదు. మూడో బృందంలోని పిల్లలను నిరీక్షణ జాబితాలో ఉంచి, అధ్యయన కాలంలో ఈ రెండు విధానాల్లోనూ పాల్గొననివ్వలేదు.

### ఫలితాలు ఎలా వచ్చాయి..

గుర్రపు స్వారీ చేసిన పిల్లల్లో హైపర్‌యాక్టివిటీ తగ్గుదల మిగతా రెండు బృందాలతో పోలిస్తే గణనీయంగా ఎక్కువగా కనిపించింది. అయితే ప్రయోజనాలు గుర్రపు స్వారీ చేసిన పిల్లలకే పరిమితం కాలేదు. గుర్రాలకు సంబంధించిన కార్యకలాపాల్లో పాల్గొన్న రెండు బృందాల పిల్లల్లోనూ, నిరీక్షణ జాబితాలో ఉన్న పిల్లలతో పోలిస్తే చిరాకు తగ్గడం, భావోద్వేగాలను నియంత్రించుకోవడం, సామాజికంగా మెలగడం వంటి అంశాల్లో మెరుగుదల కనిపించింది. గుర్రపు స్వారీతోపాటు, గుర్రాలకు సంబంధించిన క్రమబద్ధమైన కార్యకలాపాలు కూడా పిల్లలకు ప్రయోజనం కలిగిస్తాయని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. పిల్లలు, గుర్రాల మధ్య పరస్పర చర్యలు వారి ప్రవర్తన, భావోద్వేగ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం కల్పిస్తాయని పరిశోధకులు భావిస్తున్నారు. సాధారణ వైద్య చికిత్సా వాతావరణానికి భిన్నంగా ఉండే ఈ అనుభవం పిల్లలపై సానుకూల ప్రభావం చూపిస్తుందని చెబుతున్నారు.

### గుర్రాలు, పిల్లల మధ్య బంధం..

యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో అన్‌షట్జ్‌లో మనోరోగ శాస్త్ర విభాగం ప్రొఫెసర్‌గా, చిల్డ్రన్స్ హాస్పిటల్ కొలరాడోలో లైసెన్స్ పొందిన క్లినికల్ సైకాలజిస్ట్‌గా పనిచేస్తున్న రాబిన్ గాబ్రియెల్స్ మాట్లాడుతూ, గుర్రాలు పిల్లలను సహజంగా అంగీకరిస్తాయని, వారి శరీర భాషకు స్పందిస్తాయని వివరించారు. గుర్రాలతో మమేకమయ్యే సమయంలో పిల్లలు తమ శరీర భాషపై శ్రద్ధ పెట్టడం, మరో జీవి స్పందనలను అర్థం చేసుకోవడం, సంభాషణ నైపుణ్యాలను పెంపొందించుకోవడం, భావోద్వేగాలను నియంత్రించుకోవడం వంటి అంశాలను అభ్యసిస్తారు. గుర్రపు స్వారీ చేయాలంటే గుర్రంపై దృష్టి పెట్టడం, సూచనలను పాటించడం, శరీర కదలికలను సమన్వయం చేసుకోవడం అవసరం. ఇవి ఏకాగ్రత, శారీరక నియంత్రణ, ప్రవర్తనా నియంత్రణకు సంబంధించిన నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు తోడ్పడతాయి. అయితే ఈ ప్రయోజనాలకు కారణమవుతున్న నిర్దిష్ట అంశాలేమిటో తెలుసుకోవడానికి మరింత పరిశోధన అవసరమని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.



### ప్రయోజనాల కోసం గుర్రపు స్వారీ తప్పనిసరా?

ఈ అధ్యయనంలో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, గుర్రపు స్వారీ చేయకపోయినా కొన్ని ప్రయోజనాలు కనిపించడం. గుర్రపు స్వారీ చేయని బృందంలోని పిల్లలు కూడా గుర్రాల శిక్షణ కేంద్రంలో వివిధ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. ఇందులో గుర్రాల గురించి తెలుసుకోవడం, నిజమైన గుర్రం పరిమాణంలో తయారు చేసిన బొమ్మ గుర్రాన్ని ఉపయోగించడం వంటి కార్యక్రమాలు ఉన్నాయి. జంతువుల దగ్గర ఉండడానికి ఇష్టపడని పిల్లలకు, శారీరకంగా గుర్రపు స్వారీకి ఇంకా సిద్ధంగా లేని వారికి లేదా భద్రతాపరమైన కారణాలతో స్వారీ చేయలేని వారికి ఈ విధానం ఉపయోగపడే అవకాశం ఉంటుంది. గుర్రాల సమీపంలో ఉండడం వల్ల పిల్లలు సాధారణ వైద్య చికిత్సా వాతావరణానికి భిన్నమైన పరిసరాల్లో సంభాషణ, భావోద్వేగ నియంత్రణ వంటి నైపుణ్యాలను అభ్యసించవచ్చని గాబ్రియెల్స్ పేర్కొన్నారు. ప్రతి చిన్నారి అవసరాలు, సౌకర్యానికి అనుగుణంగా గుర్రాలతో కూడిన చికిత్సా కార్యక్రమాలను రూపొందించే అవకాశాన్ని ఈ అధ్యయన ఫలితాలు సూచిస్తున్నాయి.

### గత పరిశోధన ఫలితాలను మరోసారి పరీక్షించిన శాస్త్రవేత్తలు..

గతంలో తమ పరిశోధనల్లో గుర్తించిన ప్రయోజనాలు మరో ప్రాంతంలోనూ కనిపిస్తాయా అనే అంశాన్ని పరీక్షించడం ఈ తాజా అధ్యయనం లక్ష్యాల్లో ఒకటి. గత పరిశోధనల్లో ఎనిమిది నుంచి పది వారాల పాటు చికిత్సలో భాగంగా గుర్రపు స్వారీ చేయడం ఆటిజం పిల్లలకు ప్రయోజనకరంగా ఉంటుందని పరిశోధకులు గుర్తించారు. అయితే తాజా అధ్యయనాన్ని కొలరాడోలోని హార్ట్స్ అండ్ హార్సెస్ కేంద్రంలో కాకుండా, అమెరికాలోని మైనే రాష్ట్రం విండ్‌హామ్ సమీపంలో ఉన్న రైడింగ్ టు ది టాప్ అనే చికిత్సా గుర్రపు స్వారీ కేంద్రంలో నిర్వహించారు. అలాగే ఈసారి వేరే పిల్లలు, శిక్షకులు, గుర్రాలను ఉపయోగించారు. భిన్నమైన వాతావరణంలోనూ ముఖ్యంగా గుర్రపు స్వారీ చేసిన పిల్లల్లో హైపర్‌యాక్టివిటీ తగ్గుదల కనిపించడం, ఈ విధానంపై మరింత పరిశోధన చేయాల్సిన అవసరాన్ని బలపరుస్తోంది.ఆటిజం ఉన్న పిల్లల్లో, ముఖ్యంగా హైపర్‌యాక్టివిటీ సమస్యను ఎదుర్కొంటున్న వారిలో, చికిత్సలో భాగంగా గుర్రపు స్వారీ ఒక ఆశాజనకమైన అదనపు విధానంగా కనిపిస్తోంది. గుర్రపు స్వారీ చేసిన పిల్లల్లో హైపర్‌యాక్టివిటీ తగ్గుదల ఎక్కువగా కనిపించగా, గుర్రపు స్వారీ చేసిన, చేయని రెండు బృందాల్లోనూ చిరాకు తగ్గడం, భావోద్వేగ నియంత్రణ, సామాజిక నైపుణ్యాల్లో మెరుగుదల కనిపించింది. అయితే తుది నిర్ధారణలకు రావడానికి మరింత పరిశోధన అవసరం. ఇటువంటి చికిత్సా కార్యక్రమాల్లో పిల్లలను చేర్చే ముందు తల్లిదండ్రులు వైద్య నిపుణులతో చర్చించి, చిన్నారి వ్యక్తిగత అవసరాలు, భద్రత, ఆసక్తులను పరిగణనలోకి తీసుకోవాలి.

# డేటింగ్ యాప్స్..
# ప్రేమ ముసుగులో మోసాలు!

**ప్రేమ, స్నేహం, పెళ్లి పేరుతో పరిచయాలు పెంచుకుని నమ్మకం సంపాదించడం.. ఆ తర్వాత డబ్బు గుంజడం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం, ప్రైవేట్ ఫొటోలు, వీడియోలతో బెదిరించడం.. ఆన్‌లైన్ మోసగాళ్లు అనుసరిస్తున్న పద్ధతులివి. ప్రతి పరిచయమూ మోసపూరితమైనది కాకపోయినా, అవతలి వ్యక్తి నిజమైన వివరాలు తెలియని పరిస్థితుల్లో గుడ్డిగా నమ్మడం ప్రమాదకరం.**




మోసగాళ్లు మొదట ఆప్యాయంగా మాట్లాడుతూ, తమ కుటుంబం, ఉద్యోగం, ఆర్థిక స్థితి గురించి నమ్మకం కలిగించే కథలు చెబుతారు. కొద్దిరోజుల్లోనే ప్రేమను ప్రకటించి, భవిష్యత్తుపై హామీలిస్తారు. ఆ తర్వాత అనారోగ్యం, ప్రమాదం, అత్యవసర ప్రయాణం వంటి కారణాలతో డబ్బు అడుగుతారు. మరికొందరు అధిక లాభాల ఆశ చూపి నకిలీ ట్రేడింగ్ యాప్‌లలో పెట్టుబడులు పెట్టిస్తారు. మొదట లాభాలు వచ్చినట్లు చూపించి, పెద్ద మొత్తాలు జమయ్యాక డబ్బు ఉపసంహరణను నిలిపివేస్తారు. ఇతరుల ఫొటోలతో నకిలీ ఖాతాలు సృష్టించడం, ఉద్యోగం, కుటుంబ నేపథ్యం గురించి తప్పుడు వివరాలు ఇవ్వడం కూడా మోసగాళ్ల పద్ధతులే.

### మోసపు సంకేతాలివే...

- పరిచయమైన కొద్ది రోజుల్లోనే ప్రేమను ప్రకటించడం, పెళ్లి హామీలివ్వడం.
- వ్యక్తిగత వివరాలు, ఇంటి చిరునామా, కుటుంబ సమాచారం తెలుసుకోవడానికి తొందరపడటం.
- ప్రైవేట్ ఫొటోలు, వీడియోలు పంపాలని లేదా వీడియో కాల్‌లో అభ్యంతరకరంగా ప్రవర్తించాలని ఒత్తిడి చేయడం.
- అనారోగ్యం, ప్రమాదం, అత్యవసర పరిస్థితుల పేరుతో డబ్బు అడగడం.
- తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పి పెట్టుబడులకు ప్రోత్సహించడం.
- బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ, యూపీఐ పిన్ అడగడం.
- గుర్తుతెలియని లింకులు తెరవాలని, ఫైళ్లు డౌన్‌లోడ్ చేయాలని లేదా యాప్‌లు ఇన్‌స్టాల్ చేయాలని చెప్పడం.
- ఉద్యోగం, నివాసం, కుటుంబ నేపథ్యం గురించి పరస్పర విరుద్ధమైన వివరాలు ఇవ్వడం.
- పరిచయాన్ని రహస్యంగా ఉంచాలని, కుటుంబ సభ్యులు లేదా స్నేహితులతో చెప్పవద్దని ఒత్తిడి చేయడం.
- వెంటనే నిర్ణయం తీసుకోవాలని తొందరపెట్టడం, ప్రశ్నిస్తే కోపగించడం లేదా భావోద్వేగాలతో బ్లాక్‌మెయిల్ చేయడం.
- వ్యక్తిగత ఫొటోలు, చాటింగ్ వివరాలను బయటపెడతానని బెదిరించి డబ్బు డిమాండ్ చేయడం.

ఈ సంకేతాల్లో ఏవైనా కనిపిస్తే అప్రమత్తంగా ఉండాలి. ఒక్క సంకేతంతోనే మోసమని నిర్ధారించలేకపోయినా, అనుమానాస్పద పరిస్థితుల్లో డబ్బు లేదా వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదు.

### భద్రతకు జాగ్రత్తలు

ఇంటి చిరునామా, కార్యాలయం, రోజువారీ ప్రయాణ వివరాలు, కుటుంబ సమాచారం వంటి వ్యక్తిగత విషయాలను అపరిచితులతో పంచుకోకూడదు. ప్రైవేట్ ఫొటోలు, వీడియోలు పంపడం మానుకోవాలి. ప్రొఫైల్ ఫొటోలను మాత్రమే నమ్మకుండా, అవతలి వ్యక్తి చెప్పే వివరాలను స్వతంత్రంగా ధ్రువీకరించాలి. డబ్బు అడిగితే వెంటనే పంపకుండా, పెట్టుబడుల ప్రతిపాదనలను విశ్వసనీయమైన మార్గాల్లో పరిశీలించాలి. తెలియని లింకులు, ఫైళ్లు, యాప్‌లకు దూరంగా ఉండాలి.

చాటింగ్ లేదా వీడియో కాల్ ద్వారా పొందిన చిత్రాలను మార్ఫింగ్ చేసి బెదిరించడం, వాటిని కుటుంబ సభ్యులకు పంపుతామని చెప్పి డబ్బు వసూలు చేయడం వంటి సైబర్ నేరాలూ జరుగుతున్నాయి. ఇలాంటి బెదిరింపులకు భయపడి డబ్బు చెల్లిస్తే మరిన్ని డిమాండ్లు ఎదురయ్యే అవకాశం ఉంది.

### మోసపోతే..
### వెంటనే ఫిర్యాదు

డబ్బు మోసం జరిగితే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలి. cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు బ్యాంకుకు సమాచారం ఇవ్వాలి. చాటింగ్ వివరాలు, ప్రొఫైల్ లింకులు, ఫోన్ నంబర్లు, లావాదేవీల రసీదులు, బెదిరింపు సందేశాలను ఆధారాలుగా భద్రపరచాలి. ప్రైవేట్ చిత్రాలతో బెదిరింపులు ఎదురైతే పోలీసులను సంప్రదించాలి. డబ్బు తిరిగి ఇప్పిస్తామని చెప్పి మరింత డబ్బు అడిగే వ్యక్తులను నమ్మకూడదు.

ఆన్‌లైన్ పరిచయాల్లో అప్రమత్తతే రక్షణ. ప్రేమ, స్నేహం పేరుతో వచ్చే ప్రతి మాటనూ నిజమని నమ్మకుండా, వ్యక్తిగత సమాచారం, ఆర్థిక వివరాలు, ప్రైవేట్ చిత్రాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. అనుమానం వచ్చినప్పుడు దూరంగా ఉండి నిజానిజాలను పరిశీలించడమే సురక్షితం.



## శనగపిండి తయారీ ఇలా..

**పం**డుగ వేళ రకరకాల పిండివంటలు తయారుచేసుకుంటారు. శనగపిండితో తయారుచేసుకునే కఢీ, పకోడీలు, చిల్లా, కారప్పూస వంటి చిరుతిళ్లు, శనగపిండి రొట్టెలు, హల్వా తయారీని ఎక్కువమంది ఇష్టపడతారు. శరీరానికి ప్రోటీన్ అందించే ఆహార పదార్థాల్లో శనగపిండి ఒకటి. దుకాణాల్లో ప్యాకెట్ల రూపంలో శనగపిండి సులభంగా లభిస్తున్నప్పటికీ, ఇంట్లోనే కొద్ది నిమిషాల్లో తాజా శనగపిండిని తయారు చేసుకుంటే ఆరోగ్యానికి ఆరోగ్యం.. రుచికి రుచి ఉంటుంది.

శనగపిండి తయారీ కోసం 150 గ్రాముల శనగపప్పు, 60 గ్రాముల బియ్యం, 40 గ్రాముల ఎర్ర కందిపప్పు, 40 గ్రాముల పెసరపప్పు తీసుకోవాలి. శనగపప్పుతోపాటు ఇతర పప్పులు, బియ్యం కలపడం వల్ల పిండి రుచిలో మార్పు వస్తుంది. ఈ పదార్థాలను సరైన పరిమాణాల్లో తీసుకుని ఒక ప్లేట్‌లో సిద్ధంగా ఉంచుకోవాలి. ముందుగా బాణలిని వేడి చేసి తీసుకున్న పదార్థాలను అందులో వేయాలి. తక్కువ మంటపై నాలుగు నుంచి ఐదు నిమిషాల పాటు పొడిగా వేయించాలి. మధ్యమధ్యలో కలుపుతూ వేయించుకోవాలి. వేయించిన తర్వాత వాటిని ఒక ప్లేట్‌లోకి తీసుకుని పూర్తిగా చల్లారనివ్వాలి. చల్లారిన వాటిని మిక్సీ జార్‌లో వేసి మెత్తని పొడిగా పట్టుకోవాలి. పిండిలో గరుకుదనం లేకుండా జల్లెడ పట్టుకోవాలి.

### నిల్వ చేసే విధానం

ఇలా తయారైన తాజా శనగపిండిని గాలి చొరబడని డబ్బాలో నిల్వ చేసుకోవచ్చు. ఇంట్లోనే పిండి తయారు చేసుకోవడం వల్ల అవసరమైన పరిమాణంలో సిద్ధం చేసుకోవచ్చు. అయితే పిండి నాణ్యత, నిల్వ సామర్థ్యం కోసం ఉపయోగించే పప్పులు, బియ్యం శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. వేయించిన పదార్థాలు పూర్తిగా చల్లారిన తర్వాతే పొడి పట్టి, పొడిగా ఉండే గాలి చొరబడని డబ్బాలో భద్రపరుచుకోవాలి.




# బతుకమ్మకు అవమానం!

## సంప్రదాయ వేడుకలా.. రికార్డింగ్ డాన్స్‌లా

- ఇంజినీరింగ్ కళాశాలలో బతుకమ్మ పేరిట దాండియా నిర్వహణ
- సెలబ్రిటీలతో హంగామా.. ఆడాళ్లతో కలిసి కుప్పిగంతులు
- అసహ్యకరమైన వస్త్రధారణ, డీజే పాటలకు వికారపు స్టెప్పులపై విమర్శలు
- ఎంఆర్‌యూలో మల్లారెడ్డి, ఆయన కోడలు, హీరోయిన్ శ్రీలీల డ్యాన్స్‌పై సోషల్ మీడియాలో చర్చ
- ఎంపీఎస్ఆర్ కళాశాలలో విషాదం.. లైటింగ్ క్రేన్ కూలి విద్యార్థుల మృతి
- ప్రచార పోటీలోపడి గాడి తప్పుతున్న విద్యా విలువలు
- సంప్రదాయ వేడుకలను భ్రష్టు పట్టిస్తున్న నిర్వాహకులు
- తెలంగాణ మహిళా లోకానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లేదంటే కళాశాలను ముట్టడిస్తామని విద్యార్థి సంఘాల హెచ్చరికలు

విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఇంజినీరింగ్ కళాశాలలు ప్రచార ఆర్భాటాలకు, సెలబ్రిటీల సందడికి, సోషల్ మీడియా హంగామాకు వేదికలుగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో పాటు దాండియా వేడుకలను నిర్వహించడం స్వాగతించదగిన పరిణామమే అయినా.. ఆ వేడుకల పేరుతో సాగుతున్న హడావుడి, వస్త్రధారణ, డీజే పాటలకు చేసే నృత్యాలపై చర్చ మొదలైంది. విద్యార్థుల్లో సాంస్కృతిక చైతన్యం పెంపొందించాల్సిన కార్యక్రమాలు ప్రచార పోటీకి వేదికలుగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌లోని ఎంఆర్‌యూలో నిర్వహించిన బతుకమ్మ, దాండియా వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మల్లారెడ్డి, ఆయన కోడలు ప్రీతి రెడ్డి, హీరోయిన్ శ్రీలీల ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో కలిసి సందడి చేశారు. రంగురంగుల అలంకరణలు, సంగీతం, నృత్యాలతో కళాశాల ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. అయితే ఈ వేడుకలకు సంబంధించిన దృశ్యాలు బయటకు రావడంతో కొందరు నెటిజన్లు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. వస్త్రధారణ, డీజే పాటలకు వేసిన స్టెప్పులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో చర్చకు తెరలేపారు. బతుకమ్మ అనేది తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో ముడిపడిన జీవన సంస్కృతికి ప్రతీక. పూలను పేర్చి, పాటలు పాడుతూ, సంప్రదాయ నృత్యాలతో జరుపుకునే ఈ పండుగకు ప్రత్యేకమైన చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉంది. ఇలాంటి పండుగలను విద్యాసంస్థల్లో నిర్వహించడం ద్వారా యువతకు మన సంప్రదాయాలను పరిచయం చేయవచ్చు. అయితే వేడుకల నిర్వహణలో పండుగ అసలు ఉద్దేశం మరుగునపడకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

-హైదరాబాద్,

### ఎంపీఎస్ఆర్‌లో విషాదం.. భద్రతపై ప్రశ్నలు

మరోవైపు, రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లోని ఎంపీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన దాండియా వేడుకల్లో చోటుచేసుకున్న ప్రమాదం తీవ్ర ఆందోళనకు కారణమైంది. కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన లైటింగ్ క్రేన్ కూలిపడటంతో పలువురు విద్యార్థులు గాయపడగా, ఇద్దరు విద్యార్థులు మృతి చెందినట్లు అందిన సమాచారం విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం నేపథ్యంలో భారీ ఈవెంట్ల నిర్వహణలో భద్రతా ప్రమాణాలు ఎంతవరకు పాటిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వేలాది మంది విద్యార్థులు పాల్గొనే కార్యక్రమాల్లో వేదికలు, లైటింగ్ టవర్లు, క్రేన్లు, విద్యుత్ కనెక్షన్లు, అత్యవసర మార్గాల విషయంలో ముందస్తు తనిఖీలు తప్పనిసరిగా ఉండాలి. తాత్కాలిక నిర్మాణాల సామర్థ్యాన్ని నిపుణులతో పరిశీలించడం, జనసమ్మర్దాన్ని నియంత్రించడం, అత్యవసర వైద్య సదుపాయాలు కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలి. వినోదం కోసం నిర్వహించే కార్యక్రమాలు విద్యార్థుల ప్రాణాలకే ముప్పుగా మారితే దాని బాధ్యత ఎవరిదనే ప్రశ్నకు యాజమాన్యాలు సమాధానం చెప్పాల్సి ఉంటుంది.



### తల్లిదండ్రుల్లో ఆందోళన

లక్షల రూపాయల ఫీజులు చెల్లించి పిల్లలను కళాశాలలకు పంపిస్తున్న తల్లిదండ్రులు వారి చదువు, భవిష్యత్తు, భద్రతపై ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. అలాంటిది తరచూ భారీ ఈవెంట్లు, మ్యూజిక్ నైట్లు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం, వాటిలో భద్రతా లోపాలు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. కల్చరల్ ప్రోగ్రాముల పేరుతో విద్యార్థుల సమయం వృథా అవుతోందని కొందరు తల్లిదండ్రులు అభిప్రాయపడుతున్నారు. అయితే అన్ని సాంస్కృతిక కార్యక్రమాలనూ తప్పుబట్టడం కాకుండా, వాటిని విద్యార్థులకు ఉపయోగపడేలా, క్రమశిక్షణతో, భద్రతకు ప్రాధాన్యమిస్తూ నిర్వహించాల్సిన అవసరం ఉంది. క్యాంపస్‌లలో అనుచిత ప్రవర్తన, మద్యం లేదా ఇతర నిషేధిత పదార్థాల వినియోగం వంటి ఆరోపణలు ఎదురైన సందర్భాల్లో వాటిని ఆధారాలతో విచారించి తగిన చర్యలు తీసుకోవాలి. నిర్ధారణ కాని ఆరోపణల ఆధారంగా మొత్తం విద్యాసంస్థలను లేదా విద్యార్థులను తప్పుబట్టడం సరికాదు. అదే సమయంలో విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యానికి తావు లేకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

### సంప్రదాయం మాటున ప్రచార పర్వం

ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల మధ్య పెరుగుతున్న పోటీ ఇప్పుడు విద్యాబోధనకే పరిమితం కావడం లేదు. భారీ సాంస్కృతిక కార్యక్రమాలు, సినిమా తారల సందర్శనలు, మ్యూజిక్ ఈవెంట్లు, ప్రత్యేక అలంకరణలతో విద్యార్థులను ఆకర్షించేందుకు యాజమాన్యాలు ప్రయత్నిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. సెలబ్రిటీలు పాల్గొనే కార్యక్రమాల వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి వస్తుండటంతో కళాశాలలకు అదనపు గుర్తింపు లభిస్తోంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ వీడియోలు, ప్రోమోస్ ద్వారా తమ సంస్థల బ్రాండింగ్ పెంచుకోవాలనే ధోరణి కూడా పెరుగుతోందని విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి. అయితే విద్యాసంస్థల ప్రతిష్ఠను నిర్ణయించాల్సింది విద్యా ప్రమాణాలు, అధ్యాపకుల నాణ్యత, పరిశోధన, క్రమశిక్షణ, విద్యార్థుల ఉపాధి అవకాశాలు కావాలి. భారీ ఈవెంట్లు, సెలబ్రిటీల సందడి మాత్రమే కళాశాలల నాణ్యతకు కొలమానం కాదనే విషయాన్ని యాజమాన్యాలు గుర్తించాల్సి ఉంది. విద్యార్థులకు వినోదం అవసరమే అయినా, అది చదువుకు ఆటంకం కలిగించకుండా, భద్రతకు ముప్పు వాటిల్లకుండా ఉండాలనే సూచనలు వస్తున్నాయి.

